# ప్రజాశక్తి

శుక్రవారం 5 ఏప్రిల్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు


# అభివృద్ధి అంతంతమాత్రం..

- పల్నాడుపై తొలగని నిర్లక్ష్యం -ప్రచారంలో ప్రస్తావనకు రాని సమస్యలు
- రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం - శాశ్వత అభివృద్ధిపై దృష్టి సారించని అభ్యర్థులు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి**

నర్సరావుపేట పార్లమెంటు పరిధిలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. చేసిన అభివృద్ధి కంటే చేయాల్సింది ఎంతో ఉంది. తాగునీరు, సాగునీరు, విద్య వైద్య సౌకర్యాలు, రహదారులు, విద్య, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ఎన్నికల్లో చర్చ జరగడం లేదు. సహజంగా ఎన్నికలు అనగానే ప్రజలకు హామీలు ఇవ్వడం అభ్యర్థులకు అలవాటు. నియోజకవర్గాల వారీగా మేనిఫెస్టోలు రూపొందించిన అభ్యర్థులూ ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు అయితే గత ఐదేళ్లలో తాము చేసిన పనులు, భవిష్యత్తులో చేయబోయే పనులు చెబుతుంటారు. పరస్పర రాజకీయ విమర్శలు, పార్టీ మేనిఫెస్టోలు తప్ప స్థానికంగా పల్నాడు సమస్యలపై తమ ప్రసంగాల్లో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. టిడిపి అభ్యర్థులు వైసిపిని విమర్శించడం తప్ప స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పెద్దగా ప్రస్తావించడం లేదు. సిఎం జగన్‌ను విమర్శించడం, గత ఐదేళ్లలో చేపట్టని ప్రాజెక్టులను మాత్రం ఒకరిద్దరు ప్రస్తావిస్తున్నారు.

నర్సరావుపేట లోక్‌సభ టిడిపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు గత ఐదేళ్లుగా తాను అనుమతి తీసుకున్న ప్రాజెక్టులు గురించి ప్రస్తావించి ఆయా గ్రామాల్లో లింకు రోడ్లు, వరికపూడిశెల, పెన్నా-గోదావరి అనుసంధానం తదితర ప్రాజెక్టులను ప్రస్తావిస్తున్నారు. జి.వి.ఆంజనేయులు వరికపూడిశెల ప్రాజెక్టును టిడిపి వచ్చిన ఏడాదిలో పూర్తిచేస్తామంటున్నారు. వైసిపి అభ్యర్థులు అయితే గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ చంద్రబాబు నాయుడ్ని

▶ 2లో

వరికపూడిసెల నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశం, బొల్లాపల్లి మండలంలో నీటి కోసం తిప్పలు..

వినుకొండ ప్రాంతంలో ఎండిపోయిన గుండ్లకమ్మ నది.. పంపు వద్ద ఖాళీ బిందెలు

బాధ్యతలు చేపడుతున్న గుంటూరు రేంజ్ ఐజి, పల్నాడు జిల్లా ఎస్పీ

# ఐజిగా సర్వశ్రేష్ట త్రిపాఠి

- పల్నాడు జిల్లా ఎస్పిగా బిందుమాధవ్
- బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు పోలీస్ అధికారులు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి**

గుంటూరు రేంజి ఐజిగా సర్వశ్రేష్ట త్రిపాఠి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు వెలువడని వెంటనే త్రిపాఠి గుంటూరుకు వచ్చి తన కార్యాలయంలో ఐజిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను జిల్లా ఎస్‌పి తుషార్ దూడితో పాటు పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. 2006 ఐపిఎస్ బ్యాచ్‌కు త్రిపాఠి 2015 నుంచి 2017 వరకు టిడిపి హయాంలో గుంటూరు అర్బన్ ఎస్‌పిగా పనిచేశారు. ముక్కుసూటి అధికారిగా పేరుంది. త్రిపాఠి ఆ తరువాత కృష్ణా జిల్లా ఎస్‌పిగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు రేంజి ఐజిగా ఉన్న పాల్‌రాజును ఇటీవల ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఏలూరు ఐ.జి. అశోక్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం త్రిపాఠిని పూర్తిస్థాయి ఐజిగా నియమించారు.

మరోవైపు పల్నాడు ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిని కూడా ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో తాజాగా ఐపిఎస్ అధికారి గరికపాటి బిందుమాధవ్‌ను పల్నాడు ఎస్‌పిగా నియమించారు. 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన బిందుమాధవ్ గతంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అదనపు ఎస్‌పిగా పనిచేశారు. ప్రమోషన్‌పై మరో జిల్లాకు ఎస్పీగా నియమితులైన బిందుమాధవ్ తాజా తాజాగా పల్నాడు ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల దష్ట్యా పల్నాడు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల నియమావళి మేరకు విధుల నిర్వహణకు కృషి చేస్తామని, సిబ్బందిని నిత్యం అప్రమత్తంగా ఉంచుతామని ఎస్పీ చెప్పారు.

## రూ.1.50 లక్షల నగదు సీజ్

**ప్రజాశక్తి-గుంటూరు**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాలో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తాన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి తనిఖీలు చేపట్టింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.లక్షన్నర నగదు సీజ్ చేశారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటల వరకు మొత్తం రూ.కోటి 89 లక్షల 17 వేల 900 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు.

# పలువురు జడ్జీల బదిలీలు

**ప్రజాశక్తి - గుంటూరు లీగల్**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న జిల్లా జడ్జిలను, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)లను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులో మూడవ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.అర్చనను తిరుపతిలోని నాలుగవ అదనపు జిల్లా కోర్టు (ఎస్సీ, ఎస్టీ కోర్టు)కు బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు మూడవదనపు జిల్లా కోర్టు బాధ్యతలను గుంటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుంటూరులో ఫ్యామిలీ కోర్టు (12వ అదనపు జిల్లా కోర్టు)లో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న పివిఎస్ సూర్యనారాయణ మూర్తిని రాజమండ్రిలోని ఏసీబీ కోర్టుకు స్పెషల్ జడ్జిగా బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆ స్థానంలో ప్రస్తుతం రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, మంగళగిరిలో ఎడిషనల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న జి.చక్రపాణిని యమించారు. గుంటూరు పోక్సో కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేస్తున్న కె.సీతారామకృష్ణారావును విజయవాడలో ఖాళీగా

▶ 2లో

## రెండో రోజు సజావుగా పింఛన్లు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :** గుంటూరు, పల్నాడు జిల్లాలో పింఛన్ల పంపిణీ రెండోరోజైన గురువారం సజావుగా జరిగింది. గుంటూరు జిల్లాలో 2,60,830 మంది లబ్ధిదారులుండగా గురువారం రాత్రి వరకు 2,28,111 మందికి (85.69 శాతం) పింఛను అందించినట్టు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 2,82,105 మంది ఉండగా 2,50,765 మందికి (88.89 శాతం) మందికి పింఛన్లు అందించినట్లు అధికారులు ప్రకటించారు. రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు రూ.5 వేల పింఛన్లు ఇంకా విడుదల కాలేదని తెలిసింది.

## స్కానింగ్ చేయాలంటే మూడు నెలలు ఆగాల్సిందే..

పేజీ 5

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం) : 6.26

సహరీ (శనివారం ఉదయం) : 4.43

సత్తెనపల్లిలో ఎంపిడిఒకు రాజీనామా లేఖలు ఇస్తున్న వాలంటీర్లు

## 59 మంది వాలంటీర్లు రాజీనామా

**ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్, బెల్లకొండ**

సత్తెనపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 49 మంది గ్రామ వాలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రెంటపాళ్ళలో 30 మంది ధూళిపాళ్ల లో 19 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామ పత్రాలను ఎంపిడిఒ జగదీష్‌కు అందచేశారు. బెల్లంకొండ మండలంలోని పాపాయపాలేనికి చెందిన వాలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖలను ఎంపిడిఒ వెంకటరెడ్డికి గురువారం అందించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్న వీరంతా తమ లేఖల్లో పేర్కొన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న అభిమానులు

## ఘనంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పుట్టినరోజు వేడుకలు గురువారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేట ఎన్విఆర్ కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో టిడిపి శ్రేణిలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలత సంగం జాగర్లమూడి గ్రామంలో పార్టీ వర్గాలు భారీ ర్యాలీ ఏర్పాటుచేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ర్యాలీ అంగలకుదురు, సుల్తానాబాద్, చెంచుపేట, వహాబ్ రోడ్డు, గాంగణమ్మపేట, రజకచెరువు సెంటర్, గాంధీ చౌక్ మీదుగా ఎన్విఆర్ కల్యాణ మండపంకు చేరుకుంది. హిందు దేవాలయాలు చర్చి, మజీధుల్లో ఆలపాటి పేరిట అర్చనలు, ప్రార్ధనలు జరిపారు. పలుచోట్ల ఏర్పాటుచేసిన కేకులు కత్తిరిస్తూ భారీ గజమాలలతో సత్కరించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్క ఆనందబాబు, జనసేన తెనాలి నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ప్రసంగించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యే గా, మంత్రిగా రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. టిడిపి పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ నియోజకవర్గ అభివద్ధికి కషి చేస్తూ డెల్టా టైగర్ గా పేరుగాంచారని నక్కా ఆనందబాబు అన్నారు. భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇలాంటి పుట్టినరోజులు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని గురువారం ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే ఆలపాటి సాటి ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గున్నారు.

## పలువురు జడ్జీల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సిబిఐ కోర్టుకు స్పెషల్ జడ్జిగా నియమించారు. గుంటూరు పోక్సో కోర్టు బాధ్యతలను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఐదవ అదనపు జిల్లా జడ్జి నిర్వహించాలని ఆదేశించారు. గురజాలలో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లును మచిలీపట్నంలోని పోక్సో కోర్టుకు స్పెషల్ జడ్జిగా బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు గురజాల కోర్టు బాధ్యతలను గుంటూరు నాలుగవ అదనపు జిల్లా జడ్జి నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో నెల్లూరులో ఆరవ అదనపు జిల్లా జడ్జిగా పనిచేసిన ఎన్.సత్యశ్రీని తిరిగి విధుల్లోకి తీసుకొని నరసరావుపేటలో ఖాళీగా ఉన్న 13వ అదనపు జిల్లా కోర్టులో నియమించారు. అనంతపురం ఎస్సీ, ఎస్టీ కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేసిన డి.శ్రీనివాసులును తిరిగి వీధిలోకి తీసుకొని తెనాలిలో ఖాళీగా ఉన్న 11 జిల్లా కోర్టుకు నియమించారు. బదిలీ అయిన జిల్లా జడ్జిలు ఈనెల 24 లోగా తమ తమ కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. నరసరావుపేటలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)గా పని చేస్తున్న ఎ.శోభారాణిని ప్రకాశం జిల్లా కందుకూరుకు బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బాధ్యతలను అడిషనల్ సివిల్ జడ్జ్ నిర్వహించాలని ఆదేశించారు. గురజాలలో సివిల్ జడ్జి సీనియర్ డివిజన్గా పనిచేస్తున్న బి.లీలా వెంకట శేషాద్రిని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆ స్థానంలో ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎలమర్తి శ్రీనివాసరావును నియమించారు. సత్తెనపల్లిలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.నాగ వెంకటలక్ష్మి అద్దంకి కోర్టుకు బదిలీ చేసి ఖాళీ అయిన ఆ స్థానంలో ప్రస్తుతం కర్నూలులో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావును నియమించారు.

# రోడ్ల వెంట వ్యర్థాలకు నిప్పు.. ప్రజారోగ్యానికి ముప్పు..

- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- చెత్త నుండి సంపద సృష్టికి స్వస్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సి ఉండగా జిల్లా కేంద్రమైన నరసరావుపేట మున్సిపాల్టీలో మాత్రం వ్యర్థాలను గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారి పక్కనే పడేస్తున్నారు. పక్కనే డంపింగ్ ఉన్నా అందులో వేయకుండా రోడ్డుపై చెత్త వేయడం, దానిని తరచూ దహనం చేయడం వల్ల పొగ వస్తుండడంతో వాహనదారులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధానానికి మంగళం పాడారని తడి, పొడి చెత్తను వేరు చేయడం, వాటిని పునర్వినియోగంలోకి తేవడంపై పాలకులు, అధికారుల్లో చొరవ కరువైంది. ఈ నేపథ్యంలో వాతావరణ కాలుష్యం పెరగడంతోపాటు ప్రజల ఆరోగ్యానికి ముప్పు వస్తోంది. మరోవైపు ఇప్పటికే రూ.లక్షలు ఖర్చుతో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు వృథాగా పడి ఉంటున్నాయి. ప్రమాదకరమైన వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వాటి నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు, వాహనదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొందరు కేన్సర్ తదితర భయంకరమైన వ్యాధులకు గురవుతున్నారు. గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారిపై నిత్యం వాహన రద్దీ ఉంటుంది. వెలువడిన పొగలో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయాచోట్ల రహదారి మార్గం కనిపించక రోడ్డు ప్రమాదాలు వాటిల్లే అవకాశం ఉన్న నేపథ్యంలో రోడ్డు వెంట చెత్త వేయడం, నిప్పు పెట్టడం నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం : కమిషనర్

రహదారుల పక్కన చెత్తను కాల్చుతున్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దష్టికి తీసుకెళ్లగా సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువు, ఇతర పద్ధతుల్లో వినియోగంలోకి తీసుకురావాలని నిబంధనలున్నాయని చెప్పారు. రోడ్డు వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## బిజెపితో పొత్తును అర్థం చేసుకున్నారు.. : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

ముస్లిమ్, మైనార్టీల నిజమైన నేస్తం టిడిపి, చంద్రబాబేనని కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. ముస్లిమ్ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానికంగా భారీ స్థాయిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 2014-19 వరకు చంద్రబాబు ముస్లిమ్ కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. రూ.3,600 కోట్లకు పైగా వారి కోసం ఖర్చు చేసి అనేక విధాలుగా ప్రయోజనాలు అందించారని, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి ముస్లిమ్ చిరు వ్యాపారులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇమామ్‌లు, మౌజంలకు పారితోషికాలు అందించారని, దుల్హన్ పథకంతో ముస్లిమ్ ఆడపిల్లల వివాహాలకు రూ.50 వేల పెళ్లి కానుక, విదేశీ విద్యాసాయం, సివిల్స్ శిక్షణకు తోడ్పాటు తదితరాల రూపంలో వారి అభ్యున్నతికి టిడిపి అత్యంత ప్రాధాన్యమిచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజెపితో పొత్తును ముస్లిములు పెద్దమనసుతో అర్థం చేసుకుంటున్నందుకు ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త నాగశ్రీను, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి అంతంతమాత్రం..

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించడం పరిపాటిగా మారింది. నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నర్సరావుపేట,గురజాల, వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని అనేక గ్రామాలకు ఇప్పటికీ తాగునీటి సమస్య వెంటాడుతోంది. రెండు నెలలుగా పల్నాడు జిల్లాలోని దాదాపు 200 గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా ప్రజా ప్రతినిధులు స్పందించిన దాఖలాలు లేవు.

నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని గ్రామాలు బాగా వెనుకబడి ఉన్నాయి. జిల్లాలో గత పదేళ్లలో 30కి పైగా స్పిన్నింగ్ మిల్లులు ఈ ప్రాంతంలో ఏర్పడినా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగలేదు. జిల్లాలో సగటు అక్ష్యరాస్యత 67 శాతం ఉండగా పాఠశాల విద్యార్థుల డ్రాపౌట్ రేటు 26 శాతంగా ఉంది. పల్నాడు ప్రాంతంలోని కొన్ని మండలాల్లో అక్షరాస్యత 50 శాతం లోపు ఉంది. బొల్లాపల్లి, మాచర్ల, వెల్దుర్తి, కారంపూడి మండలాల్లో అక్షరాస్యత 40 నుంచి 50 శాతం మాత్రమే వుంది. మధ్యలోనే చదువు మానేసే వారి సంఖ్య ఎక్కువుగా వుంది. ఈ నేపథ్యంలో పల్నాడు ప్రాంతంలో పిజి సెంటర్‌ను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలి. ఉన్నత విద్యకు పలు యూనివర్సిటీలు, కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పల్నాడు ప్రాంతంలో ఒక ప్రభుత్వ డిగ్రి కళాశాల మాత్రమే ఉన్నది. పల్నాడు రైతుల కోసం దుర్గిలో మిర్చియార్డు నిర్మించినా నిరుపయోగంగా మారింది. గుంటూరులోని వ్యాపారుల వత్తిడి వల్ల దుర్గిలో క్రయ విక్రయాలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదు. రెండేళ్లుగా అదిగో..ఇదిగో..అంటూ కాలయాపన చేశారు. పల్నాడులో వరికపూడిశెల, అనుపు ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయడంలో 10 ఏళ్లుగా కాలయాపన జరుగుతోంది.

బుగ్గవాగు రిజర్వాయర్

బుగ్గవాగు రిజర్వాయర్ విస్తరణ కాగితాలకే పరిమితమైంది.

15 ఏళ్లుగా వ్యవసాయ రంగం సంక్షోభంలోనే వుంది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు వెంటాడుతున్నాయి. తెగుళ్ల బెడదో మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పెట్టుబడులు పెరగడం, ఆదాయం తగ్గడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతాంగంలో 65 శాతం కౌలు రైతులున్నారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోయినా వైసిపి, టిడిపి నాయకులు ప్రేక్షకపాత్ర పోషించారు. పల్నాడు ప్రాంతంలో సిమెంట్ కర్మాగారాలకు అనువైన ప్రాంతాలున్నాయి. పదేళ్ల నుండి ప్రయివేటు సంస్థలు, వ్యక్తులు వివిధ సిమెంట్ ప్యాక్టరీల పేరుతో 12 వేల ఎకరాల భూములను సేకరించి పరిశ్రమలను నిర్మించకుండా బీడు పెట్టారు. వీటిపై సమీక్షించిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు లేరు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్న సిపిఎం డిమాండ్ చేస్తోంది. అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు పల్నాడు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కోసం ప్రయత్నించిన పరిస్థితులు లేవు.

వినుకొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాలు పల్నాడులో కొన్ని ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. ఆ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువమంది వున్నారు. గిరిజనులు నివశించే తండాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. అలాగే రవాణ సౌకర్యం లేని తండాలు, తాగునీటి వసతి లేని గ్రామాలు, పాఠశాల వసతి లేని పరిస్థితులు ఉన్నాయి. గిరిజనులకు విద్య అభివృద్ధి కాకుండా సామాజికాభివృద్ధి జరగదు. పల్నాడు ప్రాంతాలో వైద్య సదుపాయాలు నామమాత్రంగానే ఉన్నాయి. నూతనంగా నర్సరావుపేటలో జిల్లా ఆస్పత్రి ఏర్పాటు చేసినా ఇప్పటికి ఎక్కువ మందిని గుంటూరుకు పంపుతున్నారు. 100 కిలోమీటర్లు దాటి గుంటూరు వచ్చేలోగా చాలా మంది మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. తెనాలిలో మాదిరిగా పిడుగురాళ్లలో జిల్లాస్థాయి ఆస్పత్రిని ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్ట పరచాలి. నర్సరావుపేట, మాచర్ల, వినుకొండ, పిడుగురాళ్ల కమ్యూనిటీ వైద్యశాలలు, పిహెచ్‌సిలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

# సామాజిక పింఛన్లను యథావిధిగా పంపిణీ చేయాలని వినతి

**ప్రజాశక్తి - వినుకొండ**

ప్రస్తుత పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ మరియు మే నెలల వద్ధాప్య పెన్షన్లు పంపిణీలో ప్రతి ఒక్క లబ్దిదారుడు సంబంధిత సచివాలయ అధికారుల వద్దకు వెళ్లి పెన్షన్లను తీసుకోవాలి అని ఇటీవలే అధికారులు సూచనలు చేయటం చాలా బాధాకరం అని అఖిలపక్ష పార్టీ నాయకులు విచారం వ్యక్తం చేశారు. సంబంధిత సమస్య స్థానిక మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు మేరకు స్థానిక మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం అఖిలపక్ష పార్టీ నాయకులు మరియు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ విధంగా అయితే వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగిందో అదేవిధంగా పెన్షన్ పంపిణీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్య రానున్న మరో నెల వరకు ఉన్నందున సంబంధిత సచివాలయాల అధికారులు లేదా ప్రభుత్వ ఉపాధ్యాయుల ద్వారా పెన్షన్ దారుని ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలన్నారు. ఇప్పటికే వృద్ధులు, వితంతువులు సంబంధిత సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తూ, కనీస వసతులు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని పలుచోట్ల వృద్ధులు చనిపోవడం జరిగిందన్నారు. అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి లబ్ధిదారుల ఇండ్ల వద్దకే పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు బాజీద్ షేక్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్కే నాయుడు, షేక్ నాగూర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రూబేన్, మాల మహానాడు నాయకులు కీర్తి పాటి వెంకటేశ్వర్లు, మరియు ప్రజా సంఘాల నాయకులు మునగపాటి ప్రసాద్ భరత్, పాల్గొన్నారు.

# విద్యార్థులు లిబరల్ ఆర్ట్స్‌లోనూ పట్టు సాధించాలి

**స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ హ్యూమానిటీస్ స్కూల్ అధిపతి థామస్ హన్సెన్**

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

ఉన్నత చదువుల్లో రాణించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు లిబరల్ ఆర్ట్స్ లోనూ పట్టు సాధించాలని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ (యుఎస్ఏ) హ్యూమానిటీస్ స్కూల్ ఆంత్రోపాలజీ హెడ్ ఆచార్య థామస్ హన్సెన్ సూచించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం వర్సిటీ ఆడిటోరియంలో 'భారత విద్యావిధానంలో లిబరల్ ఆర్ట్స్ అంతర్గత రూపకల్పన' అన్న అంశంపై విశిష్ట ప్రసంగ కార్యక్రమం జరిగింది. స్టాన్ఫోర్డ్ వర్సిటీ ప్రొఫెసర్ థామస్ హన్సెన్ ముఖ్య అతిథిగా హాజరై రీసెర్చ్ స్కాలర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచం గురించి సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు లిబరల్ ఆర్ట్స్ దోహదపడతాయని థామస్ హన్సెన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా యూనివర్సిటీ ప్రగతిని తన ప్రసంగంలో వివరించారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు అడిగిన పలు ప్రశ్నలకు డాక్టర్ థామస్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమానికి హాజరై ఎంతో విలువైన సూచనలు అందజేసిన థామస్ హన్సెన్ను యూనివర్సిటీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. శాలువా కప్పి జ్ఞాపికను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, ఈశ్వరీ స్కూల్ డీన్ డాక్టర్ విష్ణువర్థ్, డాక్టర్ అయేషా హరూన్, డాక్టర్ రజనీ ముజ్రాల్, డాక్టర్ జీఎస్ వినోద్, డాక్టర్ రాజపాండ్య తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) COURT BAPATLA.**

**I.A.No.78/2024**
In
**I.A.No.198/2023**
In
**O.S. No.248/2012.**

EmaniVenkayamma ....Petitioner/Plaintiff
V/s
1. Emani Jyothi, (Respondent/Ist defendant).
2. Emani Sri.Lakshmi (Respondent/2nd defendant).
3. Poluri Anantha Lakshmamma (Died,3rd defendant)
4. Emani PoornaChandra Rao, (Died, 4th defendant).
5. Emani Bhaskara Rao, (Died, 5th defendant)
6. Jagarlamudi Hari Babu ...Respondents.

**Order 9 Rule 9 Notice.**

పై నెంబరు I.A.No.78 /2024 లో రెస్పోండెంట్ నెం.6 కు పలుమార్లు Order 9 Rule 9 of CPC ప్రకారం నోటీసు జారీచేసినూ సదరు నోటీసు ను తీసుకొనక కావాలని కాలయాపన చేయుచున్నాడు. కనుక శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా సదరు రెస్పాండెంట్ నెం.6 కు Order 9 Rule 9 ofC.P.C. నోటీసు జారీచేయమని ఉత్తర్వులు మంజూరు చేసియున్నారు.

కావున పైనెంబరు I.A.No : 78/2024 లో
**రెస్పాండెంట్ నెం.6 అయిన :**
Jagarlamudi Hari Babu,
S/o. Satya murthy, R/o. Plot No. 1,
Door No.9-253/B.
Adavi Takkellapadu Village,
Pedapalaka luru Panchayat,
Guntur,Rural, Guntur District.

పై కోర్టు వారి ఎదుట ది:02-05-2024 ఉదయం 10:30 గంటలకు శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీయొక్క అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియడల మీపరోక్షమున సదరు పిటిషన్‌ను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు. అని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

**వాయిదా తేది : 02-05-2024.**

// శ్రీ కోర్టువారి ఉత్తర్యులతో //

**G.S.N.Mohini,**
**Advocate,**
**Bapatla-522101.**

# దుగ్గిరాల మండలంలో ఎంపి అభ్యర్థి పెమ్మసాని ప్రచారం

**ప్రజాశక్తి దుగ్గిరాల** :నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రతిష్టమైన ప్రణాళిక ఉన్న నాయకుడిని ఎన్నుకోవాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని శృంగారపురం రేవేంద్రపాడు తుమ్మపూడి చిలువూరు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వస్తుంది. హైదరాబాద్, అమెరికాలో కూడా నిరుద్యోగులు పెరిగిపోతున్నారు. ప్రతి సంవత్సరం లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే సంస్థలు ఉండాలి. అవి రావు మనమే వెంటపడి తెచ్చుకోవాలి, సంస్థలు రావాలంటే విశేష కృషి అవసరమని, కనీసం రెండు సంవత్సరాలు పడుతుందన్నారు. పెద్ద పెద్ద సంస్థలు మెట్రోపాలిటన్ పట్టణాల్లో పెడతారు గుంటూరు ప్రాంతంలో పెట్టరు మనమే వెంటపడి తీసుకురావాలన్నారు. 2014లో చంద్రబాబు నాయుడు హెచ్ సి ఎల్ టెక్నాలజీ తీసుకొచ్చారు, 2019లో జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 120 కంపెనీలు రద్దు చేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు నారా లోకేష్ తాము కలిసి ఈ ప్రాంతంలో కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు వెంకటరావు కేశం నేని శ్రీ అనిత, చంద్రశేఖర రావు, నర్రా శ్రీనివాసరావు తోటకూర సీతారామయ్య, వాసిరెడ్డి శ్రీనివాసరావు గద్దె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వృద్ధ, అనాథాశ్రమంలో ప్రవేశాలు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గోరంట్లలోని షిరిడీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ శరణాలయం, వృద్ధాశ్రమంలో ఉండేందుకు సంబంధిత అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్టు సమితి అధ్యక్షులు ఓరుగంటి విశ్వనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 అనాథ ఆశ్రమంలో ఒకటి నుంచి 9వ తరగతి వరకు ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రుల పిల్లలను చేర్చుకుంటున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తులు గోరంట్ల వెంకటేశ్వర కాలనీలోని షిర్డిసాయి ధ్యాన మందిరంలో లభిస్తాయన్నారు. అలాగే 60 ఏళ్లు దాటిన వృద్ధులను కూడా చేర్చుకుంటామని పిల్లలు, ఆర్థిక స్థోమత లేకుండా వారి పని వారు చేసుకునే వృద్ధులకు ప్రవేశం ఉంటుందన్నారు. అలాగే ఆంగ్ల భాష, కంప్యూటర్ శిక్షణ తరగతులను ఈనెల 10వ తేదీ నుంచి వచ్చేనెల 9వ తేదీ వరకు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

**పది, ఇంటర్, బి.టెక్ సర్టిఫికెట్స్ పోయినవి**

గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, అబ్బినేనిగుంటపాలెం కు చెందిన మదమంచి హరికృష్ణ తం్రడి.యమ్.శ్రీనివాసరావు కి సంబంధించిన పదవ తరగతి సర్టిఫికెట్ నెం. **CC546009**, ఇంటర్ సర్టిఫికెట్ నెం.**FO88485**, బి.టెక్ సర్టిఫికెట్ నెం.13086 కల ఒరిజినల్ సర్టిఫికెట్స్ జిరాక్స్ తీయించడానికి ఎ.బి.పాలెం నుండి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుచుండగా తిక్కిరెడ్డిపాలెం సమీపంలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది ఫోన్‌కు తెలుపగలరు.

**సెల్ : 8297326666**

## వైసిపికి సుభానీ రాజీనామా

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేసినట్టు జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రెటరీ షేక్ సుభాని తెలిపారు. వైసిపిలో ఎస్సి,ఎస్టి,బిసి, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత లేదని వీరిని ఓటు బ్యాంకుగా వినియోగించడం తప్ప ఒరగబెట్టిందేమీ లేదని ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. తనపై ఎమ్మెల్యే మద్దాలి గిరి, ఆయన పిఏ మధు, కొంత మంది వారి అనుచరులు దాడి చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తనకు వైసిపిలో అన్యాయం జరిగిందని అందువల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

## పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి

**ప్రజాశక్తి - మాచర్ల**

వెల్దుర్తి మండలంకండ్ల కుంట గ్రామానికి చెందిన గన్నెబోయిన పెద్దిరాజు పై అదే గ్రామానికి చెందిన కొమ్ము శ్రీను కొమ్మురాజు మరికొందరు కలిసి దాడి చేశారు. గురువారం గాయాల పాలైన పెద్దిరాజును మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పెద్దిరాజు మాట్లాడుతూ కొత్త పుల్లారెడ్డి గూడెమునకు చెందిన తాము ఏడాది నుండి కళ్ళకుంటలో నివాసం ఉంటున్నామన్నారు. కొమ్ము శ్రీను, కొమ్ము రాజులది కూడా కెపిగూడెమే నని, వారు కూడా వలస వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు అన్నారు. గతంలో వారికి మాకు మధ్య గొడవలు జరిగాయని,మా అన్న ను హత్య చేసిన, కేసులో, శీను, రాజులు ముద్దాయిలని తెలిపారు. ప్రస్తుతం ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగానే ఉంటున్నామని ఈరోజు తనపై పాత కక్షలు నేపథ్యంలోనే దాడి చేసి చంపేందుకు ప్రయత్నించినట్లు పెద్దిరాజు తెలిపాడు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సంఘటనా స్థలంలో మృతదేహం, చెల్లాచెదురైన కొవ్వొత్తులు

## రోడ్డు ప్రమాదంలో కొవ్వొత్తుల వ్యాపారి మృతి

**ప్రజాశక్తి నాదెండ్ల**

కొవ్వొత్తుల వ్యాపారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన గుంటూరు కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని సాతులూరు గ్రామం కరెంట్ ఆఫీస్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ బలరాం రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం ఫిరంగిపురం మండలం ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఒడిశా బాల చిన్నారావు (57) కొవ్వొత్తులు వ్యాపారం చేసుకుంటూ కిరణాషాపులకు కొవ్వొత్తులు వేస్తూ జీవన్ సాగించేవాడు. గురువారం కొవ్వొత్తులను అమ్ముకునేందుకు ఫిరంగిపురం నుండి తన ద్విచక్ర వాహనమైన స్కూటీపై బయలుదేరి నరసరావుపేట వెళ్తుండగా నరసరావుపేట నుండి గుంటూరు వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్సు ఢీకొనటంతో అక్కడికక్కడే చిన్నారావు మృతి చెందాడు. స్కూటీలో ఉన్న కొవ్వొత్తుల ప్యాకెట్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. చిన్నారావు తలకు హెల్మెట్ పెట్టుకుని ఉన్నాడు. ఒక్కసారిగా బస్సును ఢీకొట్టడంతో హెల్మెట్ లాక్ పెట్టుకోక పోవడం వల్ల హెల్మెట్ ఎగిరి పక్కన పడిపోయింది. దీంతో ఆయన తల రోడ్డుకి బలంగా గుద్దుకోవడంతోని ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చిన్నారావుకు కుమారుడు కుమార్తె భార్య ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి మృతి చెందటంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. నాదెండ్ల ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న బలసాని కిరణ్

**ప్రజాశక్తి ప్రత్తిపాడు:** నియోజకవర్గం కేంద్రంలో వైసిపి ఆధ్వర్యంలో పమిడి వెంకటరావు ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడారు. రంజాన్ మాసం ఎంతో పవిత్ర మాసమని తెలిపారు. ఉపవాస దీక్షను చేసిన ముస్లింలకు దీక్ష విరమణ అనంతరం వారికి పండ్లు ఫలహారాలు పంపిణీ చేశారు. రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో ప్రజలంతా సంతోషంగా, సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు, ప్రత్తిపాడు మండల మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

## నరసరావుపేటలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నిర్మాణం

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నిర్మాణం చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి తెలిపారు. స్థానిక జడ్‌పి బాలికల పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ ప్రాంతీయ సమావేశం గురువారం నిర్వహించారు. సమాఇవేశానికి కెఎస్ రాజు అధ్యక్షత వహించగా ప్రేమ్‌కుమార్, విజయసారధి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడ్డంలో యుటిఎఫ్ ఎప్పుడూ ముందు పీఠిన ఉంటుందని చెప్పారు. సిపిఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ కోసం జరిగే ఉద్యమాల్లోనూ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ ఉద్యమాల్లో ఉపాధ్యాయులు కలిసి రావాలని, సంఘానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి జెవిడి నాయక్, నాయకులు ఆయేషాసుల్తానా, నాసర్‌రెడ్డి, కేశవరెడ్డి, గాలిబ్ పాల్గొన్నారు.

బహుమతులు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

## ప్రకృతి సమతుల్యంపై అందరిలోనూ అవగాహన పెంచాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - మాచర్ల

ప్రకృతి సమతుల్యం పట్ల విద్యార్థి దశ నుండి అవగాహన ఉండాలని ఎంఇఒ అల్లి సురేష్ అన్నారు. స్థానిక జడ్‌పి బాలికల పాఠశాల ఆవరణలో ఎన్‌జిసి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన అల్లి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. హెచ్‌ఎం షకీనా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే భూ సంరక్షణ ఉంటుందని, ఇందుకు వ్యక్తిగా, కుటుంబంగా సమాజపరంగా కృషి అవసరమని వివరించారు. సైన్స్ కో-అర్డినేటర్ పొన్నబాబు మాట్లాడుతూ లైఫ్ సైకిల్ గురించి వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయగా వీరిని డిఇఒ వెంకటేశ్వర్లు అభినందించారు. ఎన్‌జిసి జిల్లా కో-అర్డినేటర్ షేక్ సుల్తానా ఆయేషా సమన్వయం చేశారు.

## కారంపూడిలో కూటమి ప్రచారం

ప్రజాశక్తి - కారంపూడి : మండల కేంద్రమైన కారంపూడిలోని ఎస్సీ కాలనీలో కూటమి శ్రేణులు గురువారం ప్రచారం చేపట్టాయి. బాబు సూపర్ సిక్స్ పథకాలు గురుంచి వివరిస్తూ మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# రెండో రోజూ అవే ఇబ్బందులు..!

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సామాజిక పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేయాల్సిన సచివాలయ సిబ్బంది ఒకచోట కూర్చుని ఇస్తుండడంతో సత్తెనపల్లి పట్టణంలోని వివిధ సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు పడరాని పాట్లు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగులు నడవలేక అవస్థ పడుతున్నారు. కొంతమంది సహాయకులతో ఎలాగోలా సచివాలయాలకు చేరుకున్నా అక్కడికొచ్చి క్యూలో నిరీక్షించాల్సి రావడం మరింత ఇబ్బందిగా మారింది.

## వాలంటీర్లంటే టిడిపికి భయం : బ్రహ్మనాయుడు

ప్రచారంలో మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజలకు ఐదేళ్లుగా ఇంటి వద్దనే సేవలందిస్తున్న వాలంటీర్లంటే టిడిపికి భయం పట్టుకుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని 10, 11 వార్డుల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సచివాలయ, వాలంటీరు వ్యవస్థలు ప్రజలకు ఎంతో చేరువయ్యారని అన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకోగా వాలంటీర్లు నిస్వార్థంగా సేవాలాందించారని చెప్పారు. అయితే నిమ్మగడ్డ రమేష్‌తో చంద్రబాబు కుట్రపూరితంగానే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వాంటీర్లను దూరం పెట్టించారని విమర్శించారు. పింఛన్ల జాప్యానికి, వృద్ధుల కష్టాలకు కారణం చంద్రబాబేనన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకి రాగానే వాలంటీర్‌లకు తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి ప్రజలు తనకు మళ్లీ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో తాగునీటి సమస్యలు లేకుండా చేయటంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ సంక్షేమాన్ని ఇంటి వద్దకే చేరుస్తామని చెప్పారు. వైసిపి పాలనలో లబ్ధి పొందిన వారంతా జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మరోసారి అండగా నిలవాలని కోరారు. వినుకొండ అభివృద్ధి, ప్రజలకు సంక్షేమం కొనసాగాలంటే రాష్ట్రంలో మళ్లీ వైసిపి గెలవాలని, తాను మళ్లీ ఎమ్మెల్యే కావాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

## బూతులతో ఓటమిని తప్పించుకోలేరు : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

నమ్మి ఓటేసినందుకు ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఈసారి ఓటమి ఖాయమని కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. బొల్లాపల్లి మండలం మ(రి)పాలేనికి చెందిన 10 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి వినుకొండలోని టిడిపి కార్యాలయంలో జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో నెల్లూరు రమణయ్య, పెసల వెంకటనారాయణ, సింగం శివకుమార్, గుద్దేటి పెద్దదానం, తదితరులున్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో అభివృద్ధి అనే మాట మరిచి ఇప్పుడు బూతులు తిట్టినంత మాత్రాన ఓటమిని బ్రహ్మనాయుడు తప్పించుకోలేరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్న వైసిపి రాష్ట్రవ్యాప్తంగానూ తుడిచిపెట్టుకొని పోవడం తథ్యమన్నారు. వినుకొండ ఎమ్మెల్యేగా తనను, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపిస్తే అభివృద్ధి జోడి ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. బొల్లాపల్లి మండలానికి తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. స్థానికంగానే విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని హామీనిచ్చారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేలుగా తాను, జీవీ 15 ఏళ్ల పడిన శ్రమ మొత్తాన్ని ఈ ఐదేళ్లలో బ్రహ్మనాయుడు నాశనం చేశారని, వినుకొండను అభివృద్ధికి దూరం చేశారని విమర్శించారు. ప్రజల అవసరాల పట్ల కనీస స్పృహ, సాటివారి పట్ల గౌరవం ఇసుమంతైనా లేని వ్యక్తిని ఓడించాల్సిందేనన్నారు. కార్యక్రమంలో టిడిపి బొల్లాపల్లి మండల అధ్యక్షులు జె.గోవింద నాయక్, నాయకులు పి.వెంకటనారాయణ, ఎన్.బాబురావు పాల్గొన్నారు.

# ఇళ్ల వద్దకే వెళ్లి పింఛనివ్వాలి : కలెక్టర్

### 7వ తేదీ వరకూ పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులకు, వారి ఇళ్ల సమీపంలో ఉండే వితంతువులు పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఇంటి వద్దే పింఛనివ్వాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు సచివాలయ సిబ్బంది ద్వారా 60 శాతం పైగా పెన్షన్ పెన్షన్ పంపిణీ చేశామన్నారు. 7వ తేదీ లోగా పెన్షన్ ప్రక్రియ పూర్తి చేయాలని, లబ్ధిదార్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు, అధికారులు

## ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్య రక్షణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ కోరారు. ఓటు హక్కు వినియోగంపై సత్తెనపల్లి పట్టణంలో విద్యార్థినులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాలూకా సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ పోలీస్ స్టేషన్ మీదుగా బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సాగింది. అనంతరం మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కె.షమీ మాట్లాడుతూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉషా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

## మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియపై ఎన్నికల సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ చెప్పారు. జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను గురువారం నిర్వహించారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల విధి విధానాలు నిర్వహణకు సంబంధించి ఎన్నికల పీఓ, ఏపీఓల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ప్రక్రియకు సంబంధించి నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విడతల వారీగా జరిగే ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఎన్నికల శిక్షణకు సంబంధించిన ట్రైనింగ్ ఆర్డర్స్ పోలింగ్ సిబ్బంది అందరికీ రావడం జరుగుతుందని, పోలింగ్ సిబ్బంది అందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్-12ను పూర్తి చేసుకుని తీసుకుని శిక్షణకు వచ్చేలా వారికి ఆర్ఓలు స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. జిల్లాలో 2,370 మంది పీఓ (ప్రిసైడింగ్ అధికారులు), 2,375 మంది ఏపీఓ (అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు)లకు ఎన్నికల నియమావళిపై శిక్షణిచ్చినట్లు వివరించారు.

# స్కానింగ్ చేయాలంటే మూడు నెలలు ఆగాల్సిందే..

## ఎయిమ్స్‌లో వైద్య సేవలు అంతంత మాత్రమే - క్యూలైన్‌లలో గంటలు గంటలు వెయిటింగ్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్కానింగ్ చేయాలంటే మూడు నెలలు ఆగాల్సిందే.. ఇది మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి పరిస్థితి. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి 2015 డిసెంబర్ 19 న శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 183 ఎకరాలు భూమిని కేటాయించింది. రూ.1680 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శంకుస్థాపన చేసిన రోజున 3సంవత్సరాల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం 9 సంవత్సరాలు పూర్తయింది ఇంకా కట్టడాలు కడుతూనే ఉన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ, గుండెకు సంబంధించిన స్పెషలిస్టులు ఇంకా నియమించలేదు. అవుట్ పేషెంట్ డిపార్ట్మెంట్ 2019 మార్చి 12వ తేదీన ప్రారంభమైంది. ప్రస్తుతం ఓపి రోజుకు 1500 మంది రాష్ట్ర వ్యాప్తంగాను రోగులు వచ్చి ఇక్కడ వైద్యం చేయించుకుంటున్నారు. పది రూపాయలు ఫీజుతో వైద్యం చేస్తున్నారు. ఇక్కడ ఇన్ పేషెంట్లు వార్డు కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం 350 మంది ఇన్ పేషెంట్లు ఉంటున్నారు. సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. వీల్ చైర్స్, స్ట్రక్చర్స్ చాలా తక్కువగా ఉండటం వలన వికలాంగ రోగులు ఇబ్బం దులు పడుతున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రి ప్రాంగణంలో మెడికల్ షాపు ఒకటే ఉంది. సాయంత్రం 6 గంటల వరకు మందులు కొరకు క్యూ లైన్‌లో నిలబడి నప్పటికీ చివరకు మందులు లేవని చెప్పడంతో రోగులు నిరాశ చెందుతున్నారు.

క్యూలో నిలబడ్డ రోగులు, వారికి సంబంధించిన వ్యక్తులు

పరీక్షలు చేయించు కోవడానికి మూడు రోజులు పాటు రావలసి ఉంది. పరీక్షలు చేసిన తర్వాత రిపోర్టులు రెండు మూడు రోజులు ఆలస్యం అవుతుంది. పరీక్షలకు ఫీజులు బాగానే వసూలు చేస్తున్నారు. పేదలకు అందవలసిన వైద్య సేవలు అంతంత మాత్రమే ఉన్నాయి. ఓపి కోసం, మందుల కోసం, డాక్టర్ల దగ్గర చూయించుకోవడానికి గంటలు తరబడి క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షలు కూడా క్యూ లైన్ లో ఉంటున్నారు. అనారోగ్యంగా ఉన్న రోగులు గంటలు తరబడి క్యూ లైన్‌లో నిలబడాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సిటీ, ఎమ్మారై, యు ఎస్ జి స్కాన్లు మాత్రం మూడు నెలలు తర్వాత రమ్మని చెబుతున్నారు. ఈలోగా ఎమర్జెన్సీ అయితే పట్టించుకోవడం లేదు. మరలా బయట కార్పొరేట్ హాస్పిటల్‌కు పోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నెలలు తరబడి ఉండాలంటే ఇబ్బందిగా ఉంటుందని, వేరే ప్రైవేట్ హాస్పటల్‌కు పోవలసిన పరిస్థితులు ఏర్పడు తున్నాయని రోగులు ఆవేదనగా చెపుతున్నారు.

### వేల రూపాయల ఖర్చు అవుతుంది

**గద్దె భాస్కరరావు, గొట్టిపాడు, గుంటూరు జిల్లా**

ఎయిమ్స్‌లో తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుందని వచ్చాము. అయితే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ స్పెషలిస్ట్ లేకపో వడం వలన జనరల్ వైద్యుల చేత వైద్యం చేయిస్తున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో స్పెషలిస్టు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. రూ.10 ఫీజు అని చెప్పి పరీక్షలకు వేలల్లో వసూలు చేస్తున్నారు. మందుల రేట్లు కూడా ఎక్కువగా ఉన్నాయి. తాను అరికాళ్ళ నొప్పికి వైద్యం చేయించుకోవ డానికి వచ్చానని నెల రోజులకు రూ.3000 మందులు రాశారని, వైద్య సేవలు మాత్రం మెరుగ్గా లేవన్నారు.

### పరీక్ష ఫీజులు తక్కువగానే ఉన్నాయి

**వి.ఆశీర్వాదం, లంక గ్రామం, రేపల్లె మండలం**

పరీక్ష ఫీజులు మాత్రం తక్కువగానే ఉన్నాయి. రెండు, మూడు పరీక్షలు చేయించుకున్నాను. ఒక్కొక్క పరీక్షలకు రూ.250 తీసుకున్నారు. హెర్నియా వైద్యం కోసం ఇక్కడికి వచ్చానని చెప్పారు. పరీక్షలు రిపోర్ట్లు ఇంకా రాకపోవడం వలన ఎదురు చూస్తున్నాను అన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫైబర్ గ్లాస్ విగ్రహాలు

## అహ్మదాబాద్‌కు అంబేద్కర్ ఫైబర్‌గ్లాస్ విగ్రహాలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన సూర్య శిల్ప శాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్ర, శ్రీహర్ష తయారు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫైబర్ గ్లాస్ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. వీటిని గుజరాత్ లోని అహ్మదాబాద్ నగరంలో ప్రతిష్ఠించేందుకు తరలిస్తున్నట్లు శిల్పులు తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందిస్తున్నట్లు పార్లమెంట్ భవనాన్ని పోలిన పెడస్టల్ డిజైన్‌తో తొలిసారిగా ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని తయారు చేసినట్లు చెప్పారు. అహ్మదాబాద్ నుంచి విగ్రహం తయారీకి ఆర్డర్ లభించటం కూడా ఇదే ప్రథమంగా చెప్పారు. గతంలో అంబేద్కర్ విగ్రహాలను ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు కూడా పంపించామన్నారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో కూడా ప్రతిష్టించేందుకు అంబేద్కర్ విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సందర్శకులు శిల్పుల నైపుణ్యాన్ని ప్రశంసించారు.

## పింఛను పంపిణీని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి మంగళగిరి

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి లోని అన్ని సచివాలయల పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ వి నిర్మల్ కుమార్ పరిశీలించారు. పెన్షన్ దారులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. వికలాంగులు, దివ్యాం గులు, వితంతువులు, చక్రాల కుర్చీలో వుండే వికలాంగులకు, మంచాలలో వుండే వృద్ధులకు, స్వయంగా ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేశామన్నారు.

## ఘనంగా ఆలపాటి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 64వ జన్మదిన వేడుకలు గురువారం శ్రీరాంనగర్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. వివిధ రాజకీయ పక్షాలకు చెందిన ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలు రాజా మరింత ఉత్సాహంగా పనిచేయాలని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అభిలషించారు. గుంటూరు, వేమూరు, తెనాలి,పెదకూరపాడు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి గల్లా మాధవి, టిడిపి పత్తిపాడు నియోజకవర్గం అభ్యర్థి బి.రామాంజనేయులు, టిడిపి నాయకులు వర ప్రసాద్ (బుజ్జి), తాడిశెట్టి మురళీ, వెన్నా సాంబశివారెడ్డి, డి.అప్పారావు,.పంచుమర్తి భూపతి, తిలక్ తదితరులు హాజరు అయ్యారు.

# ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

మాట్లాడుతున్న సూర్యారావు

మంగళగిరిలో పోటీ చేస్తున్న ఇండియా వేదిక ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావును గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యారావు కోరారు. గురువారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన ఎన్నికల్లో పని చేసే ముఖ్య కార్యకర్తల సమావేశం పోతురాజు స్వామిగుడి, పోలీస్‌స్టేషన్ వెనుక బజార్లలో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా సమావేశాలకు కొట్టె కరుణాకరరావు, కె.బాబూరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు మద్దతు ఇస్తున్నాయో చెప్పాలన్నారు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని తెస్తామని బహిరంగంగా చెబుతున్న బిజెపిని ఓడించడానికి దేశ వ్యాప్తంగా 300కు పైగా స్థానాల్లో ఇండియా వేదిక అభ్యర్థులు ముఖాముఖి తలపడుతున్నారని చెప్పారు. ఎన్నికల బాండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలు అక్రమార్జన చేసి ఆ డబ్బుతో ఎంపిలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. వామపక్ష పార్టీలు ఇందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. గ్యాస్ నుంచి పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించారన్నారు. విద్యుత్ సర్ ఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరిచారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్లు, ఇళ్లస్థలాలు, అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ ఉద్యమాలకు అండగా నిలిచిన జొన్నా శివశంకరరావు, ఎంపి అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు డి.విజయబాబు, కె.బాబూరావు, శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, ఎస్‌కె సుబానీ, ఎస్‌కె కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## 300 మందికి దంత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ దంత పరీక్షలు చేయించుకొని అవసరం మేరకు చికిత్సలు చేయించు కోవాలని గుంటూరు సిబార్ దంత వైద్య కళాశాల ప్రొఫెసర్స్ డాక్టర్ శ్రీనివాస్ రావూరి, డాక్టర్ రాజశేఖర్ పోట్లూరి అన్నారు. గురువారం పెదనందిపాడు లోని అశోక పాఠశాలలో వెల్లంకి బ్రదర్స్ , పోపూరి లక్ష్మీనారాయణ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య చికిత్స శిబిరంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు, పెద్దలకు దంతాల పట్ల తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు గురించి సూచనలు చేశారు. అనంతరం సిబార్ దంత వైద్య కళాశాల డాక్టర్స్ ఉజ్వల, బ్లెస్సి సృజన, వర్చస్వి 300 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పిప్పి పళ్ళు పీకటం, సిమెంటు పెట్టడం లాంటి చికిత్సలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అశోక పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరమ్మ, రోటరీ క్లబ్ సభ్యులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## లింగంశెట్టి పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

**300 మంది చిన్నారులకు అన్నదానం - 150 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ**

ప్రజాశక్తి-తాడేపల్లి

లింగంశెట్టి కిషోర్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా గురువారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉండవల్లి కరకట్ట వెంబడి ఉన్న చిగురు అనాథ ఆశ్రమంలో 300 మంది చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఉండవల్లి సెంటర్లో లింగంశెట్టి కిషోర్‌కుమార్ ఆఫీస్ వద్ద చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం 150 మంది భవన నిర్మాణ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. నూతన ఆఫీస్‌ను ప్రారంభించిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. లింగంశెట్టి కిషోర్‌కుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు నాయకులు లింగంశెట్టి కిషోర్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. సాయంత్రం ఉండవల్లి సెంటర్ రామకృష్ణ థియేటర్లో చిగురు అనాథ ఆశ్రమ చిన్నారులకు ఉచితంగా సినిమా చూపించారు. ఈ కార్యక్రమంలో అమరా సుబ్బారావు, జంగాల సాంబశివరావు, కొమ్మారెడ్డి కిరణ్, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, జొన్నా శివశంకరరావు, గోపాలం సాంబశివరావు, గోపాలం వాసుదేవరావు,గోపాలం కొండలరావు, గాదే శ్రీనివాసరావు, దాసరి కృష్ణ, బసివిరెడ్డి, కాసింఖాన్, జంగాల వెంకటేష్, పరుచూరి కిరణ్ కుమార్, టి.నాగేశ్వరరావు(మాస్టర్) తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల పాట్లు పట్టవా?

**ప్రకాశక్తి - చిలకలూరిపేట**

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు చిన్నచిన్న దుకాణాల నీడన, రోడ్ల వెంట దుమ్ము కొట్టుకుంటూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో కొద్దిపాటి నీడైనా దొరక్క ఎండలోనే అవస్థలు పడాల్సి వస్తోంది. చిలకలూరిపేట పట్టణంలో బస్ షెల్టర్ల ఏర్పాటుకు అవసరం, అవకాశం ఉన్నా ఆ దిశగా ఆర్టీసీ యోచన చేయడంలేదు. వేసవి ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రయాణికుల నిరీక్షణ సాహసంగా మారింది. వృద్ధులు, బాలింతల అవస్థలు వర్ణనాతీతం

పట్టణంలోని ప్రధాన బస్టాండ్ తర్వాత ప్రాధాన్యం కలిగిన పాయింట్ కళామందిర్ సెంటర్. చీరాల, నరసరావుపేట, గుంటూరు విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకెళ్లేవారు ఇక్కడ బస్సు ఎక్కుతుంటారు. అయితే ఇక్కడ మాత్రమే ఉన్న ఏకైక బస్ షెల్టర్‌కు కనీసం కప్పయినా లేకపోవడం మరో విడ్డూరం. పెదనదిపాడు బస్టాండ్, విశ్వనాథ సెంటర్, అడ్డరోడ్డు సెంటర్, నరసరావుపేట సెంటర్ తదితర ప్రాంతాల్లో నిత్యం ప్రయాణికులు బస్సు ఎక్కిదిగుతున్నా వారి కోసం షెల్టర్, కుర్చీలు, తాగునీరు తదితర సదుపాయాలేమీ కల్పించలేదు. తామంటే ఇంత చులకన భావం పనికిరాదని, గౌరవ ప్రదంగా ప్రయాణించే ఏర్పాట్లు చేయాలనే డిమాండ్లు ప్రయాణికుల నుండి వ్యక్తమవుతున్నాయి.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రతిఒక్కరూ వ్యవహరించాలని పోలీసులు కోరారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా తమకు సహకరించాలన్నారు. ఈ మేరకు మండల పరిదిలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, ఈవూరివారిపాలెం, పసుమర్రు గ్రామాల్లో గురువారం ప్రత్యేక బలగాలతో కవాతు చేశారు. ట్రైనీ డీఎస్పీ జగదీష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు అవాంతరాలు కల్పించే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఘర్షణలు, రాజకీయ ప్రేరేపిత అల్లర్లకు పాల్పడి జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ సిఐ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు జి.రవికృష్ణ, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కపల్లివారిపాలెంలో కవాతు

## ప్రతి ఓటునూ పట్టుదలగా తీసుకుంటేనే గెలుపు : పుల్లారావు

**ప్రజాశక్తి - చిలకలూరిపేట :** అత్యంత కీలకంగా మారిన ప్రస్తుత ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటునూ పట్టుదలగా తీసుకుంటేనే గెలుస్తామని కూటమి తరుపున చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక 32వ వార్డులో ఆయన గురువారం పర్యటించారు. ఎస్టీ సామాజిక తరగతికి చెందిన 35 కుటుంబాలు అవ్వారు రమేష్, బిట్రా బ్రహ్మం, దానియేలు ఆధ్వర్యంలో వైసిపిని వీడి టిడిపిలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ పింఛన్ల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న రాజకీయం మానవత్వానికి మచ్చన్నారు. ఈ కుట్రలను తిప్పి కొట్టడానికి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. వైసిపి సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను దీటుగా తిప్పికొట్టాలన్నారు.

## సీజనల్ జ్వరాలే.. భయం వద్దు..

**ప్రజాశక్తి - క్రోసూరు :** దోమతెరలు వాడాలని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను పారద్రోల వచ్చని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్.బాలఅంకమ్మ భాయ్ అన్నారు. మండలంలోని పారుపల్లిలో పలువురు జ్వరాల బారిన పడిన నేపథ్యంలో గురువారం గ్రామాన్ని సందర్శించి జ్వరాలు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు వివరించారు. శుక్రవారం నుండి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, వైరల్ జ్వరాలేమీ నమోదు కాలేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న జ్వరాలు సీజనల్ జ్వరాలేనని తెలిపారు. వేసవి నేపథ్యంలో ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ఎండలో తిరగొద్దని చెప్పారు. ఇప్పుడున్న జ్వరాలపై కంగారొద్దని, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ చేపట్టారని తెలిపారు. మురుగునీరు సక్రమంగా పారేటట్లు చూడాలని, మురుగునీటిపై చెత్తను, కాల్వల్లో సిల్టును తొలగించి సుదూర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఏబేటు ద్రావణం పిచికారీ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పందులను ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండేటట్లు చూడాలన్నారు.

## పలు పదవులకు నియామకాలు

**ప్రజాశక్తి - వినుకొండ :** కాంగ్రెస్ పార్టీలోని పలువురి నాయకులకు నూతన బాధ్యతలు అప్పగించినట్లు పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ గురువారం తెలిపారు. పి.విజయ్‌ను ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, కె.దేవను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జి.సుధాకర్‌ను ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులుగా, జి.హరిబాబును నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమించి పత్రాలు అందించారు. బి.రామాంజనేయులు, పి.సుధాకర్, ఎ.శ్రీను పాల్గొన్నారు.

# తాగునీరు లేకున్నా.. మద్యం ఏరులు..

**ప్రజాశక్తి - మాచర్ల**

ప్రచారంలో బ్రహ్మారెడ్డి

నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగునీరు సరిగా అందుబాటులో లేకున్నా మద్యం మాత్రం ఏరులై పారుతోందని కూటమి తరపున మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి విమర్శించారు. మండలంలోని తాళ్ళపల్లిలో గురువారం ప్రచారం చేసిన ఆయన మాట్లాడుతూ సాగర్ డ్యామ్ పరిధిలో ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. విద్య, వైద్య రంగాల్లో సమగ్ర అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. పింఛన్ల అంశంపై మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్), సెర్ప్ సిఈఓలు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించటం వలనే పెన్షన్ల నిధుల విడుదలలో జాప్యం, పంపిణిలో గందరగోళం నెలకొందని, వైసిపికి పెన్షనర్సను అనుకూలంగా మార్చేకుట్రలో భాగంగా ఈ నాటకాలాడారని విమర్శించారు. ప్రతినెలా 1వ తేదిన పెన్షన్ మొత్తం పెన్షన్‌దారులకు అందించేందుకు ఇప్పటి వరకు పని చేసిన సిఎస్ ప్రస్తుత నెలలో భిన్నంగా వ్యవహరించటం బాధ్యతా రాహిత్యమన్నారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల పెన్షన్‌దారులకు 1.50 లక్షల మంది ఉన్న సచివాలయాల సిబ్బంది లబ్ధిదార్ల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణి చేయకపోవటం శోచనీయమన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వ టీచర్లను మద్యం దుకాణాల వద్ద డ్యూటీలు చేయించారని, వారితో పింఛన్లు సులువుగా పంచవచ్చన్న ఆలోచన ప్రభుత్వానికి రాలేదా? అని ప్రశ్నించారు. తక్షణం సిఎస్, సెర్ప్ సిఈఓలను బాధ్యతల నుండి తప్పించి ఈ అంశంపై ఈసి సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆనారోగ్యం వలన జరిగిన మృతిని కూడా వైపిపి తమ శవ రాజకీయాలకు వాడుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.వీరాస్వామి, ఎం.పెదవెంకటరామిరెడ్డి, సైదారావు, బ్రహ్మానాయుడు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బ్రహ్మారెడ్డి సమక్షంలో పలువురు మైనారిటీలు టిడిపిలో చేరగా వారికి బ్రహ్మారెడ్డి టిడిపి కండువాలు కప్పారు.

## ఓటర్లలో చైతన్యం కోసం హోర్డింగులు

**ప్రజాశక్తి - మాచర్ల**

తమ ఓటు అమూల్యమైనదని ప్రజలు గుర్తించేలా నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల అసెంబ్లీ నియోజవకర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. జెసి ఆదేశాలతో పట్టణంలోని పలు ప్రాంతాలలో ఓటర్లను చైతన్య పర్చేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. ఓటు విలువ తెలుసుకోని ప్రతి ఓటరు రానున్న జనరల్ ఎలక్షన్స్‌లో మే 13న ఓటు హక్కుని వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగవద్దని, అర్హత కల్గిన వారు నూతనంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని జెసి సూచించారు. సి విజిల్, ఓటర్ హెల్ప్ లైను, ఇ-ఎపిక్ తదితర యాప్‌ల గురించి వివరిస్తూ పట్టణంలో హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటును తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి, కమిషనర్ డి.వెంకటదాసు పర్యవేక్షించారు. పట్టణంలో, రూరల్ పరిధిలో పలు గ్రామాల్లో ప్రత్యేక రథం ద్వారా ఓటర్లను చైతన్యపర్చేందుకు ప్రచారం చేపట్టారు.

# వడ్డెర్లకు 30 శాతం క్వారీలు కేటాయించాలి

## మృతుని కుటుంబానికి సాయంలో వాట అడిగిన మంత్రికి ఓటు అడిగే హక్కు లేదు : టిడిపి

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్**

వడ్డెరలకు జనాభా దామాషా ప్రకారం క్వారీలు కేటాయించాలని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల వెంకటస్వామి డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని టిడిపి ప్రజా వేదికలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తరతరాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన వడ్డెరలకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. వడ్డెర జనాభా దామాషా ప్రకారం క్వారీల్లో 30 శాతం హక్కుగా వస్తున్నదాన్ని వైసిపి నాయకులు లాగేసుకొని వారి జీవన భృతిపై దబ్బె కొట్టారని మండిపడ్డారు. వడ్డెర కుల వృత్తికి సంబందించిన రోడ్డు రోలర్, జెసిబి, ట్రాక్టర్లు వంటివి టిడిపి ప్రభుత్వ హయాంలో వడ్డెర కార్పొరేషన్ ద్వారా ఇచ్చేవారని, ప్రస్తుతం వాటిని నిలిపేశారని అన్నారు. సత్తెనపల్లిలో వడ్డెర సామాజికి తరగతికి చెందిన యువకుడు పని నిమిత్తం వెళ్లి సెప్టిక్ ట్యాంక్‌లో పడి మరణిస్తే ప్రభుత్వం నుండి వచ్చే సాయంలో కూడా వాటాను డిమాండ్ చేసిన మంత్రి రాంబాబుకు వడ్డెర్ల ఓట్లు అడిగే హక్కు లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపికి వడ్డెరలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఓర్సు శ్రీహరి, కొమెర శ్రీనివాసరావు, కొమెర శంకర్, చల్లా శ్రీనివాసరావు, కొమెర నాగేశ్వరరావు, బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న బీసీ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

## చంద్రబాబు రోడ్డుషోను విజయవంతం చేయండి

**ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్**

శనివారం జరిగే చంద్రబాబు రోడ్ షోను విజయవంతం చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కోరారు. దీనిపై సత్తెనపల్లి రఘురాం నగర్‌లోని టిడిపి ప్రజావేదికలో సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. రోడ్ షోకు సంబంధించి రూట్ మ్యాప్, విధివిధానాలపై ముఖ్యనాయకులతో లక్ష్మీనారాయణ చర్చించారు. నియోజకవర్గం నుండి పెద్దఎత్తున జనన్ని సమీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అంబటి మురళీకృష్ణ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

జన సైనికులను కించపరిచే వ్యాఖ్యలు చేసిన పొన్నూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంబటి మురళి కృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు డిమాండ్ చేశారు. గురువారం పొన్నూరు జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతు ఇటీవల అంబటి మురళీకృష్ణ ఓ ఇంటర్వ్యూలో జనసేన శ్రేణులు తమతో ఉన్నారని చెప్పటాన్ని తీవ్రంగా ఖండించారు. జనసేన పార్టీకి నీతి నిజాయితీ, విలువలు ఉన్నాయన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పొన్నూరు నియోజ కవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మీడియా సమావేశంలో పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ఎన్నం నాయుడు జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ పీవో, ఏపీఓలకు శిక్షణ కేంద్రాల కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్ఐసి సెంటర్‌లో ఉత్తర్వులు జనరేట్ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జిల్లాలో సాధరణ ఎన్నికలకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించిన ఉద్యోగులకు శిక్షణ కేంద్రాల కేటాయింపునకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను రూపొందించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 1915 పోలింగ్ కేంద్రాలలో పీవో, ఏపీవోలుగా రిజర్వు సిబ్బందితో కలిపి 4600 మంది ఉద్యోగులకు పోలింగ్ కేంద్రాలలో నిర్వహించాల్సిన విధులపై నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలలో ఏప్రిల్ 15, 16వ తేదిల్లో మొదటి విడత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఎన్నికల మ్యాన్ పవర్ నోడల్ అధికారి శైలజ, ఎన్ఐసీ డిఐఓ బిమల్‌కుమార్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఏఈఆర్వో బీమారావు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పట్టణంలోని 12, 11 వార్డులలో గురువారం టిడిపి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ప్రచారం చేశారు.టిడిపి కూటమి ప్రకటించిన బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ 6 లోని సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీళ్ల ట్యాంకర్ కూడా రోజు మార్చి రోజు వస్తుందని నీరు సరిపోవటం లేదని నీటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరారు.

## అవినీతి రహిత పాలన కోసం కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అవినీతి లేని అత్యుత్తమ పాలనే లక్ష్యంగా ఏపీ యునైటెడ్ ఫ్రంట్ పని చేస్తుందని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జలీల్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ ఏపీ యునైటెడ్ ఫ్రంట్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గురువారం గుంటూరులోని అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికలు సజావుగా జరగాలన్న మరియు సమర్థవంత పాలన జరగాలన్న వెంటనే వాలంటరీ వ్యవస్థను. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన దర్శి జవహర్ రెడ్డిని విధులు నుండి తొలగించాలని, రాష్ట్రంలో శాంతిభద్రత విషయంలో విఫలమైన రాష్ట్ర డిజిపి రాజేందర్ రెడ్డిని వెంటనే విధులలో నుండి తొలగించాలని ఎన్నికల కమిషన్ ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అవినీతిని అంతం చేస్తూ పేద బడుగు బలహీన వర్గాలకు ప్రజల అభివద్ధి అభ్యున్నతి ధ్యేయంగా పరిపాలన అందించేందుకు ఏపీ యునైటెడ్ ఫ్రంట్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందని తెలియజేశారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించి పరిచయం చేశారు. యునైటెడ్ ఫ్రంట్ గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జల్ది అనిల్ కుమార్ ను గుంటూరు పార్లమెంటు ప్రజలందరూ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో ధారా నాగేశ్వరరావు, నీలం రమేష్ బాబు, ఎన్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రంట్ అభ్యర్థులతో జలీల్, జల్జి అనిల్

## ఆధునిక కబేళా నిర్మాణం చేస్తా

### మంగళగిరిలో పెమ్మసాని ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 14, 15, 16 వార్డుల్లో గురువారం గుంటూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి బాప్టిస్ట్ పేటలో ఆధునిక కబేళ నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలు, కళ్యాణ మండపం నిర్మాణం చేస్తానని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ

సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్లు లేని 20వేల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్, ఎంపి అభ్యర్థిగా తనకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, జి ధనుంజయ రావు, జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, షేక్ సుభాని, టీ కొండలరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కే నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## అత్తోటలో నాదెండ్ల మనోహరం ప్రచారం

ప్రజాశక్తి - కొల్లిపర

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి నాదెండ్ల మనోహరం అన్నారు. గురువారం మండలంలోని అత్తోట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె తెనాలి శాసనసభ్యులుగా నాదెండ్ల మనో హర్‌ను, గుంటూరు పార్లమెంటు సభ్యునిగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఎర్రు వెంకయ్య నాయుడు, వేణుగోపాల్ రెడ్డి టిడిపి పార్టీ నాయకులు భీమవరపు చిన్న కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిని గెలిపించాలని కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లిపర

నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే శివకుమార్ సతీమణి అన్నాబత్తుని పుష్ప అన్నారు. గురువారం కొల్లిపర శివారు గుడి బండి వారి పాలెం లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందించిన సంక్షేమ, అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి శాసనసభ్యులు శివకుమార్‌కి ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి పిల్లి రాధిక మండల పార్టీ అధ్యక్షులు అవుతూ పోతిరెడ్డి, కల్లం వీరారెడ్డి, నిర్ల కుటుంబ రెడ్డి భీమవరం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

## 7న హోమియో వైద్యంపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 11 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో హోమియోపతి వైద్యంపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. ఈ సభలో ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ సభలో హోమియో వైద్యపితామహుడు డాక్టర్ హనీమన్ జయంతి కూడా నిర్వహించబడుతుందన్నారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభించిన గోపి శ్రీనివాసులు

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

అనాధలకు వృద్ధులకు సేవలు అందించే విషయంలో తాము ఏర్పాటు చేసిన సేవ శక్తి యూత్ ముందుంటు ందని అధ్యక్షులు కొమ్మినేని గోపి అన్నారు. గురువారం స్థానిక శివాలయం వద్ద సేవ శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గోపి, శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం దాతల సహకారంతో చల్లని మజ్జిగ ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. గత పది సంవత్సరాలుగా తమ శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజల సహకారంతో బడుగు బలహీనవర్గాలకి అనేక విధాలుగా సేవలు అందించాలనే లక్ష్యంతో సేవా శక్తి యూత్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో శాంతి బాబు, సిహెచ్ లోకేష్, ఎన్ కిషోర్, సిహెచ్ శ్రీనివాసరావు, రామచంద్రరావు, శివయ్య పాల్గొన్నారు.

## తాడేపల్లిలో 90 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణ, రూరల్ గ్రామాల్లో 90 శాతం పింఛను పంపిణీ చేసినట్లు ఎంటిఎంసి కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. గురువారం తాడేపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పింఛనుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. వికలాంగులు, వితంతువులు, నడవలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. అందరు సచివాలయ సిబ్బంది లబ్దిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పంపిణీ కార్యక్రమం సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు.

## మరమ్మతులకు నోచని బోరు పంపు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వెనుక బజారులో బోరు పంపు నుంచి నీరు రావడంలేదు. గత వారం నుంచి పాడైపోయిన ఈ బోరు పంపు నుంచి నీరు రాకపోవడంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులు పడుతున్నారు. పాడైపోయిన బోరు పంపును అధికారులు తక్షణమే మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## న్యాయవాది గంట సతీష్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వత్తి ప్రాక్టీస్ చేస్తున్న గంట సతీష్‌కుమార్‌కు కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. సతీష్‌కుమార్ వర్సిటీ న్యాయశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఐ.పవన్‌కుమార్ మార్గదర్శకత్వంలో 'సైబర్‌క్రైమ్ అండ్ సైబర్ లా ఇన్ ఇండియా పర్స్‌పెక్టివ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంట సతీష్ కుమార్‌కు కేఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కె.వి.ఎస్.ఎం కామ్‌సాయి, ఎం.రమాసత్యనారాయణ, న్యాయవాదులు వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి, చింత రామకోటిరెడ్డి, సురేంద్ర తదితరులు అభినందనలు తెలియజేశారు.

## సిజిజిబికి ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

అవార్డు అందుకుంటున్న బ్యాంకు చైర్మన్, తదితరులు

న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన 97వ స్కాచ్ సమ్మిట్‌లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సిజిజిబి) ప్రతిష్టాత్మకమైన స్కాచ్ కార్పొరేట్ ఎక్సలెన్స్ గోల్డ్ అవార్డును అందుకుంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సెక్టార్స్ కేటగిరీ కింద ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌లో పని తీరుకు సిజిజిబి ఈ అవార్డు అందుకుంది. ఈ అవార్డు ఆర్థిక అక్షరాస్యత, ప్రతి ఒక్కరికీ బ్యాంకు సేవలను అందుబాటులో ఉంచడాన్ని సూచిస్తుందని బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వర రావు పేర్కొంటూ, ఈ అవార్డు మా కస్టమర్‌లు, షేర్ హోల్డర్లకు ఉన్నతమైన బ్యాంకింగ్ సేవలను అందించడంలో మా నిబద్ధతను చూపిస్తుందన్నారు.ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి.రమణారావు, సీనియర్ మేనేజర్, హెచ్ఒడి ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ కె.ఆంజనేయులు అందుకున్నారు.ఈ సందర్భంగా ఈ విజయం బ్యాంకింగ్ రంగంలో అభివద్ధి, నూతన ఆవిష్కరణలకు ప్రతిబింబమని, మా కషిని గుర్తించిన స్కాచ్ అవార్డుల జ్యూరీకి బ్యాంకు చైర్మన్ కృత జ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును బ్యాంకు ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు కామేశ్వరరావు తెలిపారు.

## మెడికల్ కళాశాలకు విశ్రాంత పోస్టల్ ఉద్యోగి మృతదేహం

ప్రజాశక్తి తెనాలి

టి.కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

స్థానిక మారిసిపేటకు చెందిన పోస్టల్ శాఖ విశ్రాంత ఉద్యోగి టి కృష్ణమూర్తి (78) గురువారం ఉదయం వాకింగ్ కు వెళుతూ అస్వస్థతకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య శ్రీలక్ష్మి, ఇరువురు కుమారులు ఉన్నారు. పోస్టల్ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన శాఖాపరంగా ఎంతో చాక చక్యంగా పనిచేశారు. అలాగే సామాజిక సేవా దృక్పథం కలిగిన ఆయన తన మరణం తర్వాత మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అందించాలని ఆరు నెలల క్రితమే కుటుంబ సభ్యులకు లిఖితపూర్వకంగా ఆయన తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆకాంక్షను కుటుంబసభ్యులు నెరవేర్చారు. కృష్ణమూర్తి మృతి చెందిన వెంటనే గుంటూరు మెడికల్ కళాశాలకు సమాచారం అందించారు. వారు గురువారం సాయంత్రం మారిస్ పేటలోని కృష్ణమూర్తి నివాసానికి వచ్చి ఆయన పార్థీవ దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన తమ తండ్రి మరణించిన తర్వాత కూడా విజ్ఞానాన్ని పంచేందుకు తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని కుమారులు సురేంద్రబాబు, సుధీర్ చెప్పారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని, బిఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్లకు పోలింగ్ కేంద్రం వివరాలు తెలియచేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను, బిఎల్‌ఓలను ఆదేశించారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని సెక్టార్ 3లోని పాత గుంటూరు, వినోభా నగర్, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఆర్‌ఓలు, సెక్టోరల్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులైన ర్యాంప్‌లు, ఓటర్ల రాకపోకలకు వీలుగా బ్యారీకేడింగ్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాల కల్పన వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు పాఠశాలల్లో ఉన్నందున, కొన్ని గదుల్లో నాడు-నేడు పనుల సామాగ్రి, ఇతర మెటీరియల్ ఉంటే వాటిని సంబంధిత ప్రదానోపాధ్యాయులతో చర్చించి వేరే గదులకు తరలించాలన్నారు. ఒకే కేంద్రంలో ఉండే ఒకటి కంటే అధికంగా పోలింగ్ స్టేషన్లు ఉంటె ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఏఈ భాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేంద్రానికి సంబంధిత పోలింగ్ కేంద్రం నంబర్, బిఎల్‌ఓ పేరుతో బోర్డ్ లను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను, పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఏఆర్‌ఓలు కూడా నియోజ కవర్గంలో ర్యాండంగా కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. అనంతరం బిఎల్‌ఓలతో గత ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళి, పోలింగ్ శాతం ఇతర వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ బిఎల్‌ఓలు తమ పరిధిలో ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనేలా ఓటింగ్ శాతం పెంచాలని, ఓటర్లకు పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియచేయాలన్నారు. పర్యటనలో ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, వెంకట లక్ష్మీ, సెక్టోరల్ అధికారులు నాగ శేషు, శ్రీధర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిఈఈ శ్రీధర్, ఏసిపిలు మురళి, అజయ్ కుమార్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు పూర్తి చేయాలి

### నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

పట్టాభిపురంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పెరుగుతున్న ఎండల దష్ట్యా నగరంలో ప్రజలకు, నగరానికి ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారి దాహార్తి తీర్చాడానికి చలివేంద్రాల ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. గురువారం నగరంలో చలివేంద్రాల ఏర్పాటు, సిబ్బంది కేటాయింపుపై నగరపాలక సంస్థ ఎస్.ఈ, ఇతర ఇంజినీరింగ్ అధికారులకు సెట్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నగరంలోని ప్రధాన కేంద్రాల్లో, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో నగరపాలక సంస్థ తరుపున షుమారు 45 ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా ఇప్పటికే 19 ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. గుంటూరు నగరానికి ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తారని, వారికి త్రాగునీరు అందించడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఈల వారిగా ఎన్ని చలివేంద్రాలు ఏర్పాటు అవసరం, వాటి ప్రతిపాదనలను పరిశీలించి వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చలివేంద్రాల్లో నిర్దేశిత సమయం వరకు త్రాగునీరు అందించేందుకు తగిన సిబ్బందిని కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఎస్ఈ ని ఆదేశించారు.

## నగరంలో 86.17 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - గుంటూరు

నగరంలో గురువారం సాయంత్రం వరకూ 86.17 శాతం మంది లబ్ధిదార్లకు సామాజిక పింఛన్లు పంపిణీ చేశామని కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుండి వికలాంగులు, దీర్ఘకాల వ్యాధి గ్రస్తులకు ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా నగరంలోని 206 వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదార్లకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక సదుపాయాలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. టెంట్‌లు, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకి అనుగుణంగా శుక్రవారం సాయంత్రం కల్లా పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

## పింఛన్లపై వైసిపి కపట రాజకీయం : గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పింఛన్ల పంపిణీలో వైసిపి కపట రాజకీయం చేస్తుందని టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లక్షన్నర మంది ఉద్యోగులు ఉండగా వీరి చేత ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా కేవలం వాలంటీర్లు లేకపోవడం వల్ల వృద్ధులు, వికలాంగులకు ఎన్నో సమస్యలు వచ్చాయని సృష్టించడం తగదన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వైసిపి ప్రాకులాడుతుందని కానీ సొమ్మును సకాలంలో ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బంది పెట్టిన విషయాన్ని మాత్రం వైసిపి అంగీకరించదన్నారు. ఉదయం 10 గంటల కల్లా ఉద్యోగులకు సొమ్ము ఇవ్వాల్సి ఉండగా సాయంత్రం వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. టిడిపి వల్ల పింఛన్ దారులకు కష్టాలు వచ్చాయని చిత్రీకరించి రాజకీయంగా లబ్ధిపొందటానికి వైసిపి ప్రయత్నిస్తుందని ప్రజలు అన్నీ గ్రహిస్తున్నారని అన్నారు. అనంతరం ఆమె 30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర, రావిపాటి సాయి, కనకాచారి, జనసేన నాయకులు ఆళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో గల్లా మాధవి

## వర్సిటీలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ అలోచనలు ఆచరణలోకి తీసుకెళ్లాలని యోగి వేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి ఆర్. సతీష్ బాబు పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో జగజ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు బాబు జగజీవన్ రామ్ ఛైర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు ఛైర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మధుబాబు అధ్యక్షత వహించారు. సతీష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలనీ, ఆయనలోని రాజకీయ చైతన్యాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ ప్రజల ఆకాంక్షలను సంతోషాలను, వారి భవిష్యత్ కోసం పార్లమెంటులో ఆచరణకు కృషి చేశారని అన్నారు. సుదీర్ఘ పార్లమెంట్ సభ్యునిగా జగజీవన్ రామ్ స్థాపించిన రికార్డును ఎవరు అందుకోలేరన్నారు. జగ్జీవన్ రామ్ పై విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ మాట్లాడుతూ ఆలోచనపరంగా, ఆచరణ పరంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా జగజ్జీవన్ రామ్ గొప్పతనాన్ని గుర్తు ఎరగాలన్నారు. విశ్వవిద్యాలయంలో ఉన్న జగ్జీవన్ రామ్ ఛైర్ దేశ నలుమూలల నుంచి పరిశోధకులు వచ్చేలా పరిశోధనలు, పుస్తకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కోఆర్డినేటర్ ఆచార్యకే మధుబాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న జగ్జీవన్ రామ్ చైర్ ద్వారా జగ్జీవన్ రామ్ ఆలోచన దృక్పథాన్ని సమాజానికి అందజేసే పరిశోధనలు, కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ముందుగా వర్సిటీలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాక్రమంలో ప్రిన్సిపల్ కే. గంగాధర రావు, సీహెచ్. స్వరూప రాణి, పి. జాన్సన్, పి. సిద్ధయ్య, ఈ. శ్రీనివాస రెడ్డి, అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగ రాజు, జి. చెన్నారెడ్డి, కో ఆర్డినేటర్ లు జి. అనిత, వై . అశోక్ కుమార్, కే.సోమ శేఖర్, ఎం. త్రిమూర్తి రావు, కె.. వి. శాంతి శ్రీ తదితరులు పాల్గొన్నారు.